ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 11.06.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణలో బీజేపీ బలపడుతోందని... కాంగ్రెస్ , బీఆర్ఎస్ ప్రజావిశ్వాసం కోల్పోయాయని బీజేపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు.

2. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 2 వేల 400 కోట్ల రూపాయలు కేటాయించిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించారు.

3. హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

4. హైదరాబాద్ లో కేంద్ర బొగ్గు , గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బొగ్గు , లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై ఏర్పాటు చేసిన రోడ్ షో కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది.

**సిద్దిపేట**

తెలంగాణలో బీజేపీ బలపడుతోందని , కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజా విశ్వాసం కోల్పోయాయని బిజెపి తెలంగాణ అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. సిద్దిపేటలో జరిగిన రెండు రోజుల దీన్ దయాళ్ ప్రశిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో రాంచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ... రెండు సీట్ల స్థాయి నుండి నేడు వరుసగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయికి బిజెపి ఎదగడానికి కార్యకర్తల త్యాగాలే కారణమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బాధ్యతలు నిర్వర్తించకుండా , తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బిజెపిపై విమర్శలు చేయడం సబబుకాదని అన్నారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలు ప్రజల సమస్యలపై మరింత

బలంగా పోరాడుతూ , తెలంగాణలో 'డబుల్ ఇంజన్ సర్కార్ 'ను తీసుకురావాలని పిలుపునిచ్చారు. బిజెపి "నేషన్ ఫస్ట్" అని నమ్ముతుందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు మాత్రం అధికారం-అవినీతే ప్రధానమని రామచందర్ రావు ఆరోపించారు.

పిటిసి, సిద్దిపేట

**బండి సంజయ్**

రసాయనాల వాడకం వల్ల రోగాలు పెరుగుతున్నాయని , ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 2 వేల 400 కోట్ల రూపాయలు కేటాయించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజ య్ కుమార్ తె లిపారు. కరీంనగర్ జిల్లా , జమ్మికుంటలో ప్రకృతి వ్యవసాయంపై జరిగిన రైతు సమ్మేళనంలో బండి సంజయ్ పాల్గొ ని మాట్లాడుతూ... ఆర్గానిక్ ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతోందని , సేంద్రీయ సాగు చేసే రైతులు భవిష్యత్తులో మంచి లాభాలు గడిస్తారని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో కరీంనగర్ జిల్లాలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి , ఆ పంటలకు మద్దతు ధర లభించేలా చూస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

పిటిసి, కరీంనగర్

**పొన్నం ప్రభాకర్**

కరీంనగర్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈరోజు జిల్లా కేంద్రంలో నిర్మితమైన నూతన కలెక్టరేట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

పిటిసి, కరీంనగర్

**కిషన్ రెడ్డి**

జూలై 1 వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా అమలుకానున్న VB-G RAM G పథకాన్ని తెలంగాణలో సజావుగా అమలు చేయడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి , కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో చర్చించారు. ఉపాధి హామీ రోజులను 100 నుంచి 125కి పెంచుతూ తెచ్చిన ఈ పథకానికి గానూ తెలంగాణకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి 3 వేల 825 కోట్ల రూపాయలు కేటాయించినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఇందులో కొత్తగా రోజ్ గార్ కార్డులు, వారం రోజుల్లో వేతనం, ఆలస్యమైతే వడ్డీ, నిరుద్యోగ భృతి, ముఖ ఆధారిత హాజరు, వ్యవసాయ పనుల సమయంలో 60 రోజుల విరామం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. 60:40 నిష్పత్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఖర్చు చేసే ఈ పథకానికి తనవంతు వాటా నిధులు కేటాయించి, సకాలంలో నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కిషన్ రెడ్డి కోరారు.

**Desk**

**వివేక్**

మంచిర్యాల జిల్లా, మందమర్రిలో జరిగిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు గడ్డం వంశీకృష్ణ, సురేష్ షెట్కార్ లు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరిట కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని మంత్రి ఆరోపించారు. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ , బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట భారీగా అప్పులు చేసిందని , ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

పిటిసి, మంచిర్యాల

**తుమ్మల**

ఖమ్మంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటన బాధితురాలిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ... నిందితుడు రెండో అంతస్తు నుండి బాలికను తో సి వేయడంతో తీవ్ర గాయాలయ్యాయని

చెప్పారు. బాలిక కాళ్లు , చేతులకే కాకుండా వెన్నుముకకు సైతం గాయాలు అయ్యాయని , కోలుకోవడానికి రెండు నెలల సమయం పడుతుందని తెలిపారు. ఎంత ఖర్చైనా ప్రభుత్వమే భరించి వైద్యం అందిస్తుందని ,అలాగే బాధితురాలి కుటుంబానికి కూడా అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

పిటిసి, ఖమ్మం

**సీతక్క**

రాబోయే ఖరీఫ్ సీజన్ రైతులు మంచి ఆదాయం గడించేలా ములుగు జిల్లా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన కిసాన్ మేళా సాంకేతిక సదస్సు ను గోవిందరావుపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...

బైట్ ... సీతక్క

పిటిసి, ములుగు

**పొన్నం**

నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లేన్ రహదారులతో అనుసంధానం కలిగిన హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి ఈరోజు హుస్నాబాద్ బస్ స్టేషన్‌ను పరిశీలించారు. బస్ స్టేషన్‌లో వర్షాకాలంలో ఏర్పడుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ... ఇంజినీరింగ్ కళాశాలలు , పర్యాటక రంగం , మెడికల్ కళాశాలలు , పారిశ్రామిక కారిడార్ అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు.

పిటిసి, సిద్దిపేట

**రోడ్ షో**

హైద్రాబాద్, నోవాటెల్ ( HICC) హోటల్‌లో కేంద్ర బొగ్గు , గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల పై ఏర్పాటు చేసిన రోడ్ షో కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. దేశ ఇంధన భద్రతను పెంపొందించడం , దిగుమతులను తగ్గించడం , పర్యావరణహిత సాంకేతికతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ సదస్సుకు కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి , ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే హాజరయ్యారు. బొగ్గును సింథసిస్ గ్యాస్ గా మార్చే అత్యాధునిక గ్యాసిఫికేషన్ టెక్నాలజీపై ఈ సదస్సులో చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి సనోజ్ కుమార్ ఝాతో పాటు సింగరేణి ప్రతినిధులు , ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పిటిసి, హైదరాబాద్

**ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**

కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈరోజు లోక్ భవన్ లో గవర్నర్ ను కలిసిన కొమురయ్య ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. పీఎం సురక్షా బీమా, జల్ జీవన్ మిషన్ , ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డు వంటి దాదాపు 22 కేంద్ర పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో సరిగా అమలు చేయడం లేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పంట నష్టపోయిన రైతులకు మేలు చేసే ఫసల్ బీమా యోజనను అమలు చేయకపోవడం వల్ల అన్నదాతలు నష్టపోతున్నారని ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు.

పిటిసి, హైదరాబాద్

**కోమటిరెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 17న నల్గొండ జిల్లా కనగల్‌లో 14 వేల 500 కోట్ల రూపాయల వ్యయంతో హ్యాం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన, బహిరంగ సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి

కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు.     ఈరోజు కలెక్టరేట్‌లో  జిల్లా  కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. సభకు వచ్చే ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని , వీలైతే ధర్వేశిపురం ఎల్లమ్మ గుడి ఆధునికీకరణ పనులకు కూడా ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామని మంత్రి పేర్కొన్నారు.

పిటిసి, నల్గొండ